www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
సోమవారం | 27 | ఏప్రిల్ | 2026 పేజీలు : 6

## వైద్యశాలలపై మరింత పర్యవేక్షణ పెరగాలి



-సీజనల్ వ్యాధులపట్ల ప్రజలను అప్రమత్తం చేయాలి
-ప్రభుత్వ ఆసుపత్రులపై సామాన్యులకు నమ్మకం కలిగించాలి
-సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే కూనంనేని

2లో..

# బంకుల వద్ద బారులు..
# నో స్టాక్ బోర్డులు..!








### -జిల్లాలో పెట్రోల్, డీజిల్ కొరత
### -ఆందోళనలో వినియోగదారులు

**ప్రజాపక్షం/ ఖమ్మం :** పెట్రోల్, డీజిల్ కొరత ఏర్పడడంతో బంకుల వద్ద వాహనాలు బారులు తీరాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా బంకుల్లో పెట్రోల్ దొరకడం లేదు. శనివారం సాయంత్రం నుండి డీజిల్ కొరత ఏర్పడగా ఆదివారం పెట్రోల్ కూడా లభ్యం కాకపోవడంతో పెద్ద సంఖ్యలో వాహనదారులు పెట్రోల్ బంకుల వద్దకు చేరుకున్నారు. ఎండ వేడిమి సైతం లెక్కచేయక గంటల తరబడి బంకుల వద్ద పడిగాపులు కాశారు. ఉమ్మడి జిల్లాలో అతికొద్ది బంకుల్లో తప్ప ఎక్కడ పెట్రోల్, డీజిల్ లభ్యం కావడం లేదు. ఖమ్మం నగరంలోని లారీ ఓనర్స్ అసోసియేషన్ బంకులో తప్ప ఎక్కడ పెట్రోల్, డీజిల్ లేదు. ఆదివారం ఉదయం కొన్ని బంకుల్లో లభించినప్పటికీ ఆ తర్వాత నో స్టాక్ బోర్డులు కనిపించాయి. ఉమ్మడిజిల్లాలో పలు బంకుల వద్ద నో స్టాక్ బోర్డులతో పాటు బంకుల్లోకి రాకుండా తాళ్లు కట్టేశారు. ఖమ్మం బైపాస్ రోడ్డులో డీజిల్ కొరతతో మిగతా 2లో..

## జావిద్ మరణం
# కాంగ్రెస్‌కు తీరని లోటు




**ప్రజాపక్షం/ ఖమ్మం :** కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, ఖమ్మం నగర మాజీ అధ్యక్షులు మహ్మద్ జావిద్ మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని రాష్ట్ర మిగతా 2లో..

-సైనికునిలా పనిచేసే నాయకున్ని కోల్పోయాం : భట్టి
-జావిద్‌కు భట్టి, తుమ్మల తదితరుల నివాళి
-కుటుంబ సభ్యులకు పరామర్శ

## కలెక్టర్ బదిలీకి వెలుగుమట్లే కారణమా..?

-గతంలో ఆర్‌డిఓ, ఎంఆర్‌ఓ బదిలీ
-నూతన కలెక్టర్‌గా దివాకర






2లో

## మోదీ విధానాలు దేశానికి ముప్పు



-పదేళ్ల బిజెపి పాలనలో పది లక్షల ఆత్మహత్యలు
-సహజ పోరాట యోధుడు ఏలూరి
-సిపిఎం పోలిట్ బ్యూరో సభ్యులు విజ్జు కృష్ణన్

2లో..

# బంకుల వద్ద బారులు.. నో స్టాక్ బోర్డులు..!





(మొదటిపేజీ తరువాయి)

పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. దేశ వ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ కొరత లేదంటున్న ఖమ్మంజిల్లాలో ఒక్కసారిగా ఎందుకు ఈ కొరత ఏర్పడిందనేది అర్థం కావడం లేదు. అధికార యంత్రాంగం గడిచిన వారం రోజులుగా డీజిల్, పెట్రోల్‌కు ఎటువంటి కొరత లేదని సరఫరా సరిగ్గానే ఉందని చెప్పినప్పటికీ డీజిల్, పెట్రోల్ కోసం ఇండెంట్ పెట్టవద్దని సంబంధిత బాధ్యులు బంకుల యజమానులకు సూచించారు. కొందరు బంకుల యజమానులు పెట్టిన ఇండెంట్లను సైతం రద్దు చేయించినట్లు సమాచారం. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 4,280 బంకులు ఉండగా ఇందులో 2,503 బంకులు ప్రైవేటు యాజమాన్యంలో ఉన్నాయి. మిగిలినవి ఆయిల్ సంస్థలు నడిపిస్తున్నాయి. ఖమ్మం జిల్లాలో మొత్తం 221 బంకులు ఉండగా 80 శాతం బంకుల్లో డీజిల్, పెట్రోల్ కొరత ఏర్పడింది. కృత్రిమ కొరత సృష్టించారనుకుంటే ఒకట్రెండు చోట్ల ఏర్పడాల్సిన డీజిల్, పెట్రోల్ కొరత ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉండడంతో ఆందోళన మొదలైంది. దూర ప్రయాణం చేయాల్సిన లారీలు ఎక్కడికక్కడే ఆగిపోయాయి. ప్రస్తుతం యాసంగి వరి కోతలు నడుస్తుండడంతో వరి కోత మిషన్లు డీజిల్ లేక నిలిచిపోయాయి. వ్యవసాయ పనుల కొరకు ట్రాక్టర్లు కూడా డీజిల్ లేక రైతుల పనులు నిలిచిపోయాయి. ద్విచక్ర వాహన దారులు బంకుల ఎదుట బారులు తీరారు. కొన్ని బంకుల్లో ఒక్కో వాహనానికి లీటరు చొప్పున పోస్తున్నారు. బంకుల వద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. డీజిల్ కొరత మరింతగా ఏర్పడుతుందని, రెండు, మూడు రోజులు దొరకదని కొందరు క్యాన్లతో బంకుల వద్ద భారీ క్యూ కట్టారు.

# కలెక్టర్ బదిలీకి వెలుగుమట్లే కారణమా..?



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆకస్మిక బదిలీ అయ్యారు. ఈ బదిలీపై భిన్న స్వరాలు వినవస్తున్నాయి. కలెక్టరే బదిలీ చేయించుకున్నారన్న ప్రచారం ఒక పక్క సాగుతుండగా మరో పక్క కలెక్టర్ బదిలీకి కూడా వెలుగుమట్ల ఘటనే కారణమని ప్రచారం జరుగుతుంది. దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమైన వెలుగుమట్ల ఘటనకు సంబంధించి జిల్లా ఉన్నతాధికారి బదిలీ కావడం చర్చనీయాంశమైంది. కలెక్టర్ తనంతట తాను బదిలీ కోరుకున్న కూడా వెలుగుమట్ల ఘటనే కారణమని భావిస్తున్నారు. ఫిబ్రవరి 24న వెలుగుమట్ల రెవెన్యూలో నివాసాలు ఏర్పాటు చేసుకుని పదేళ్ల పాటు నివసిస్తున్న వారి ఇండ్లను కూల్చి రోడ్డున పడేశారు. ఈ ఘటన ప్రభుత్వానికి ఒక మాయని మచ్చలా మిగిలింది. మంత్రుల ప్రోద్బలంతోనే వెలుగుమట్ల కూల్చివేతలు జరిగాయని విపక్షాలు ఆరోపిస్తుండగా ముగ్గురు మంత్రుల మధ్య ఉన్న విబేధాలు చిలికి చిలికి గాలివానలా మారి అధికారులను బలిపశువులను చేశారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ఈ ఘటన జరిగిన కొద్ది రోజులకే ఖమ్మం ఆర్డివో నర్సింహారావు, తహసీల్దార్ సైదులు బదిలీ అయ్యారు. కూల్చివేతల పై విమర్శలు ఆగకముందే ఇప్పుడు లబ్దిదారుల ఎంపికపై విమర్శలు వినవస్తున్నాయి. 313 మందిలో వందకు పైగా లబ్దిదారులు వెలుగుమట్లతో ఎటువంటి సంబంధం లేని వారని కొందరు రాజకీయ నాయకుల ప్రోద్బలంతో ఇది జరిగిందని జాబితాలో చేర్చారని ఆరోపణలు వినవస్తున్నాయి. వెలుగుమట్ల ఎక్కడ ఉందో తెలియని వారు ధనవంతులు కూడా వెలుగుమట్ల లబ్దిదారుల ఎంపికలో స్థానం సంపాదించారు. ఇది ఎలా అన్న దానిపై తీవ్ర విమర్శలు వినవస్తున్నాయి. కూల్చివేతల తర్వాత కూడా లబ్దిదారుల ఎంపికపై ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో కలెక్టర్ బదిలీ జరిగింది. కలెక్టర్, ఇతర అధికారులు లక్ష్యంగా వీధినపడ్డ బాధితులు పలు శాపనార్థాలు పెట్టారు. ఆవేదనతో తీవ్ర విమర్శలు చేశారు. ఈ విమర్శలు కూడా కలెక్టర్‌ను బాధించాయన్న ప్రచారం జరిగింది. మొత్తానికి ఏడాది గడవక ముందే కలెక్టర్ బదిలీ కావడం వెనక మరో కారణం కూడా ఉందని ప్రచారం జరుగుతుంది. ముగ్గురు మంత్రుల మధ్య అధికార యంత్రాంగం నలిగిపోతుందని ఈ క్రమంలోనే బదిలీలు చోటు చేసుకుంటున్నాయని ప్రచారం జరుగుతుంది. మొత్తంగా కారణాలు ఏమైనా కలెక్టర్ బదిలీ మాత్రం తీవ్ర చర్చనీయాంశమైంది. ఇదిలా ఉండగా నూతన కలెక్టర్ దివాకర ఆదివారం రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. సోమవారం బాధ్యతలు తీసుకునే అవకాశం ఉంది.

# మోడీ విధానాలు దేశానికి ముప్పు

**ప్రజాపక్షం/ ఖమ్మం :** మోడీ అనుసరిస్తున్న విధానాలు దేశానికి ముప్పుగా మారాయని సిపిఎం పోలిట్ బ్యూరో సభ్యులు విజ్జు కృష్ణన్ తెలిపారు. బిజెపి విధానాల కారణంగా దేశంలో పదేళ్ల కాలంలో పది లక్షల మంది ఆత్మహత్యలు చేసుకున్నారని మోడీ విధానాలకు వ్యతిరేకంగా పోరాడటంలో ఏఐకెఎస్ కీలకంగా వ్యవహరిస్తుందని ఆయన తెలిపారు. సిపిఎం నాయకుడు ఏలూరి లక్ష్మి నారాయణ 34వ వర్ధంతి సందర్భంగా ఆదివారం సిపిఎం కార్యాలయంలో నున్నా నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో విజ్జు కృష్ణన్ మాట్లాడుతూ మోడీ పాలనలో ఆదివాసీలు, దళితులపై దాడులు అధికమయ్యాయన్నారు. మహారాష్ట్రలో రైతుల పరిస్థితి మరింత దారుణంగా ఉందని 1930 నాటి పరిస్థితులు దేశంలో పునరావృతమవుతున్నాయన్నారు. 1933లో హిట్లర్ ఫాసిస్టు పార్టీ ఆవిర్భవించిందన్నారు. ఖమ్మం జిల్లాకు సంబంధించి ఏలూరి లక్ష్మి నారాయణ పోరాట స్ఫూర్తిని రగిల్చిన నాయకుల్లో ఒకరని విజ్జు కృష్ణన్ తెలిపారు. ఉద్యమం లేని చోట ఉద్యమాన్ని సృష్టించి ముందుకు నడిపిన ప్రముఖుల్లో ఏలూరి ఒకరన్నారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ ఏలూరి లక్ష్మి నారాయణను స్ఫూర్తిగా తీసుకుని పోరాడాలన్నారు. ఏలూరి కుటుంబ సభ్యులు చేసిన త్యాగం వెలకట్టలేనిదన్నారు. కమ్యూనిస్టు ఉద్యమానికి ఆటుపోట్లు వస్తుంటాయని అటువంటి ఆటుపోట్లను తట్టుకుని నిలబడిన వాడే నిజమైన కమ్యూనిస్టు అని తమ్మినేని తెలిపారు. అమెరికా కుట్రను ఇరాన్ తిప్పికొడుతుందంటే ఇరాన్ వెనక చైనా ఎర్రజెండా ఉందన్నారు. ఉత్తమ కమ్యూనిస్టు లక్షణాలన్ని ఏలూరి లక్ష్మి నారాయణలో ఉన్నాయన్నారు. ఎర్రజెండా ముద్దుబిడ్డ ఏలూరి అనే పుస్తకాన్ని సిపిఎం నేతలు ఆవిష్కరించారు. ఈ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, పుస్తక రచయిత సోమయ్య, ఏలూరి సహచరుడు రాజారావు, సీనియర్ నాయకులు బత్తుల హైమావతి, ఆనందాచారి, ఎం. సుబ్బారావు, మచ్చా వెంకటేశ్వర్లు, ఏలూరి కుమార్తె వరలక్ష్మి తదితరులు ప్రసంగించగా బండి రమేష్, అన్నవరపు కనకయ్య, బుగ్గవీటి సరళ, బొంతు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



# వైద్యశాలలపై మరింత పర్యవేక్షణ పెరగాలి



**ప్రజాపక్షం/కొత్తగూడెం :** వైద్యశాలలపై మరింత పర్యవేక్షణ పెరగాలని, ప్రజారోగ్యం పట్ల ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా సంబంధిత అధికారులపై చర్యలకు సిఫారసు చేస్తానని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు హెచ్చరించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులతో ఆయన ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వైద్యశాల మొదలుకొని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వరకు ఎక్కడా మందుల కొరత లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సామాన్య ప్రజలు నమ్మకంతో ప్రభుత్వ ఆసుపత్రులకు వస్తారని, వారికి అందుబాటులో ఉన్న వనరులతోనే నాణ్యమైన చికిత్స అందించి ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి సూచించారు. వైద్యశాలల్లో రోగులకు, సహాయకులకు కావాల్సిన సదుపాయాలు సమకూర్చాలని, పారిశుధ్యం, నీటి వసతి వంటివాటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలను బలోపేతం చేయాలని, మారుమూల గ్రామాల్లో వైద్య శిబిరాల నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఆసుపత్రులల్లో ఖాళీగా ఉన్న పోస్టులు, అవసరమైన వైద్య పరికరాలు మరియు మందుల నిల్వలపై సమగ్ర నివేదికను వెంటనే తనకు అందజేయాలని అధికారులను కోరారు. వైద్యులు, సిబ్బంది విధుల్లో అలసత్వం ప్రదర్శించకుండా జవాబుదారీతనంతో పనిచేయాలని, అప్పుడే పేదలకు మెరుగైన వైద్యం అందుతుందని ఆయన ఈ సందర్భంగా దిశానిర్దేశం చేశారు. సమీక్షా సమావేశంలో జిల్లా వైద్యశాఖ అధికారి తుకారాం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# జావిద్ మరణం కాంగ్రెస్‌కు తీరని లోటు



(మొదటిపేజీ తరువాయి)

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. పదేళ్లు అధికారంలో లేకున్నా ఆయన ఓ సైనికుల్లా పోరాడి పార్టీని రక్షించారని ఆయన తెలిపారు. దివంగత కాంగ్రెస్ నేత జావిద్ సంస్మరణ కార్యక్రమం ఆదివారం కాంగ్రెస్ కార్యాలయంలో జరిగింది. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వైరా శాసన సభ్యులు మాలోత్ రాందాస్ నాయక్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, నగర అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి, కార్పొరేషన్ ఛైర్మన్లు రాయల నాగేశ్వరరావు, నాయుడు సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు, సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు లు పాల్గొని నివాళులర్పించారు. భట్టి విక్రమార్క మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఏ పని అప్పగించినా తూచ తప్పకుండా విజయవంతంగాపూర్తి చేసే నాయకుల్లో జావిద్ ఒకడన్నారు. విద్యార్థి , యువజన కాంగ్రెస్ నాయకునిగా పార్టీలో పని చేశారని పార్టీ సిద్ధాంతాలను ప్రజలకు వివరించడంలో జావిద్ దిట్ట అని విక్రమార్క తెలిపారు. ఏఐసిసి ప్లీనరీ సమావేశాల్లో సేవాదళ్ యూనిఫాంలో విధులు నిర్వహిస్తూ జాతీయ నాయకులను సైతం ఆకర్షించారన్నారు. తనకు అత్యంత ఆప్తుడని ఆ ఒక్కరోజు మినహా నేను ఖమ్మం ఎప్పుడు వచ్చినా తనతోనే ఉండేవారన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ జావిద్ లాంటి వ్యక్తులు అరుదుగా ఉంటారని ఆయన మరణం పార్టీకి తీరని లోటన్నారు. ఆయన కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. అంతకు ముందు భట్టి విక్రమార్క కాంగ్రెస్ నాయకులతో కలిసి రెడ్‌హిల్స్‌లోని జావిద్ కుటుంబాన్ని పరామర్శించారు. పిల్లల చదువుకు అండగా నిలుస్తామని కాంగ్రెస్ అన్ని విధాలా చేయూత నిస్తుందన్నారు.

# చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

**-సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం**
**-సిపిఐ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ**





ప్రజాపక్షం/ ఖమ్మం : ఎండలు మండుతున్న సమయంలో సిపిఐ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేసి చల్లని త్రాగునీరు అందించడం అభినందనీయమని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. గడిచిన వారం రోజులుగా ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరిగాయని ప్రజలు అల్లాడుతున్నారన్నారు. సిపిఐ జిల్లా సమితి సభ్యులు వరదా నర్సింహారావు ఆధ్వర్యంలో ఖమ్మం వన్‌టౌన్ పరిధిలోని అల్లిపురం క్రాస్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హేమంతరావు మాట్లాడుతూ వేసవి కాలంలో నీటి కొరత తీర్చేందుకు అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వమే చలివేంద్రాలను ఏర్పాటు చేసి నిరంతరాయంగా త్రాగునీటిని అందించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని హేమంతరావు సూచించారు. సేవాభావంతో సిపిఐ వన్‌టౌన్ నాయకులు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చడం ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. రానున్న కాలంలో మరిన్ని చలివేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజాసేవలో ముందు వరుసలో నిలవాలని ఆకాంక్షించారు. అనంతరం మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని సిపిఐ నేతలు ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి ఎస్‌కె జానిమియా, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు మహ్మద్ సలాం, బిజి క్లైమెంట్, జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్, ఏనుగు గాంధీ, యానాలి సాంబశివరెడ్డి, వరదా నర్సింహారావు, సిపిఐ నాయకులు మాదుగుల నాగేశ్వరరావు, యాకూబ్, చందు, సిద్ది శ్రీను, వెంకీ, ఉమా, ముత్తయ్య, తాళ్లూరి శ్రీను, సుశీల, నాగమణి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వాసవి మాత జయంతి

**నిరుపేద ఆర్యవైశ్య విద్యార్థినికి రూ.25వేలు వితరణ**





ప్రజాపక్షం/వైరా: వైరా వాసవి కళ్యాణ మండపం వైరా మండల, పట్టణ ఆర్యవైశ్య మహాసభ సంయుక్త ఆధ్వర్యంలో ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం వాసవి మాత అమ్మవారి జయంతి సందర్భంగా వైరా ఆర్యవైశ్య కళ్యాణ మండపంలోని అమ్మవారి విగ్రహానికి అభిషేకాలు, పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. తొలుత అమ్మవారి జయంతి కార్యక్రమాన్ని అధికారిక పండుగ జాబితాలో చేర్చినందుకు గాను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలిపారు. ఆర్‌టిసి బస్టాండ్ నందు అల్పాహారం దాన కార్యక్రమం నిర్వహించారు. ఆర్యవైశ్య పేద విద్యార్థినికి రూ.25వేలు ఆర్థిక సాయం అందజేశారు. మైసూర్ దత్త పీఠం వారు నిర్వహించిన భగవద్గీత కంఠస్థ పోటీల్లో గోల్ మెడల్ సాధించిన ఆర్యవైశ్య సోదరీమణులను శాలువాలతో ఘనంగా సన్మానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య కళ్యాణ మండపం గౌరవ అధ్యక్షులు వనమా విశ్వేశ్వరరావు, అధ్యక్షులు డాక్టర్ పెరుమాళ్ళ కృష్ణమూర్తి, సెక్రటరీ నూకల శ్రీనివాసరావు(వాసు), వైరా మండల ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు మిట్టపల్లి కిరణ్‌కుమార్, ఆర్యవైశ్య మహాసభ సెక్రటరీ కొల్లా రాంబాబు, వాసవి డైమండ్ అధ్యక్షులు నండూరి శ్రీనివాసరావు, డైమండ్ క్లబ్ సెక్రటరీ వజినేపల్లి రవి, వనిత క్లబ్ సెక్రటరీ రాయల అన్నపూర్ణ, వనితా క్లబ్ కోశాధికారి మిట్టపల్లి సుధారాణి, కోదండ రామాలయం మాజీ చైర్మన్ మిట్టపల్లి సత్యంబాబు, నూకల ప్రసాదరావు, కొప్పురావూరి సత్యనారాయణ, తెల్లాకుల సందీప్, వనమా మణికుమారి, రాయపూడి రజిని, నాళ్ల మల్లేశ్వరి, మిట్టపల్లి రాజ్యలక్ష్మి, రాయపూడి మాధవి, కొంతం గీత, కటకం దివ్య, రాయల రోజా, సుగ్గల మాధవి, నూకల వాణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వాసవి కన్యకాపరమేశ్వరి జయంతి



ప్రజాపక్షం/ తల్లాడ : తల్లాడ గ్రామపంచాయతీ ఆవరణంలో రాష్ట్ర ప్రభుత్వం కన్యక పరమేశ్వరి జయంతి వేడుకలను అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం మేరకు తల్లాడ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ ఈ వేడుకలను ఆదివారం గ్రామపంచాయతీ ఆవరణంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలోభాగంగా ఆర్యవైశ్యులు, మహిళలు భారీ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు మాట్లాడుతూ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి మొదటిసారి జయంతి వేడుకలను నిర్వహించటం నా అదృష్టంగా భావిస్తూ ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. తల్లాడలో వాసవి కన్యకా పరమేశ్వరి ఫంక్షన్ హాల్‌లో అమ్మవారి అనుగ్రహంతో ప్రతి సంవత్సరం సుమారు 200మంది అయ్యప్ప స్వాములు దీక్షతో 18సంవత్సరాలు దీక్ష చేశామని తెలిపారు. ప్రజాసేవలో ఆర్యవైశ్యులు ముందు ఉంటారని, లైన్స్‌క్లబ్ ద్వారా ఆర్యవైశ్యులు చాలామంది నిరుపేదలను గుర్తించి చాలా సేవలు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కర్నాటి లక్ష్మారెడ్డి, ఆర్యవైశ్యుల సంఘం మాజీ అధ్యక్షులు చిన్నస్వామి, సంఘం అధ్యక్షులు జవ్వాని నగేష్, లైన్స్ క్లబ్ జోనల్ మేనేజర్ దారా శ్రీనివాసరావు, బూసా పురుషోత్తంరావు, కేతేపల్లి భాస్కర్‌రావు, మిట్టపల్లి కృష్ణ, వేమిశెట్టి పార్థసారథి, లగడపాటి నెహ్రూ, బండారు భద్రయ్య పాల్గొన్నారు.

# నూతి సత్యనారాయణకు ఘన స్వాగతం



ప్రజాపక్షం/ తల్లాడ : అఖిలభారత కాంగ్రెస్ కమిటీ దేశవ్యాప్తంగా మండల, పట్టణ అధ్యక్షుల నియామకం కోసం సంఘటన సృజన్ అభియాన్ కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఆదివారం తల్లాడ మండలం పాత పినపాక గ్రామంలో సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ విజయకుమార్ ఆదేశాను సారం ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ పర్యవేక్షణలో పాత పినపాక సర్పంచ్ గుర్రం శ్రీను నేతృత్వంలో బూత్ ఏజెంట్లు, గ్రామ అధ్యక్షులు ఎన్నుకోవడం జరిగింది. ఈసందర్భంగా గుర్రం శ్రీను మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం బూత్ ఏజెంట్ల, గ్రామ అధ్యక్షుల నియామకం చేపట్టిందని, రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇంకా బలోపేతం, స్థిరంగా ఉండటానికి మనమందరం తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి వివరించాలని, ప్రతిఒక్కరూ కాంగ్రెస్ పార్టీకి కట్టుబడి పనిచేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీలో కష్టపడిన ప్రతికార్యకర్తకు కాంగ్రెస్ పార్టీ తోడుగా ఉండి తగిన పదవులు గుర్తింపు ఇస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పాత పినపాక గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, బూత్ లెవల్ ఏజెంట్లు, గ్రామ అధ్యక్షులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ వాసవి మాత జయంతి



ప్రజాపక్షం/ మధిర : మధిర శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో శ్రీవాసవి మాత జయంతి వేడుకలు శ్రద్ధా భక్తులతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అత్యధిక సంఖ్యలో భక్తులు, మహిళలు, కమిటీ సభ్యులు హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వాసవి మాత జయంతి వేడుకల్లో భాగంగా దేవాలయ అధ్యక్షులు పల్లపోతు ప్రసాదరావు వాసవి మాత పతాకాన్ని ఆవిష్కరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మధిర శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవాలయం నుండి మేళతాళాల నడుమ పెండికుల, మిధునకుల, పునగశిలతో పాటు అన్ని గోత్రికుల వారు పసుపు, కుంకుమ, గంధం, కొబ్బరి చిప్పలు, జాకెట్ ముక్కలు, గాజులు, పూలు, బియ్యం, బెల్లం వంటి సామాగ్రితో కన్యలు, సుహాసినిలు ఊరేగింపుగా అమ్మవారి దేవాలయానికి చేరుకున్నారు. అనంతరం అమ్మవారి జయంతి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు, హోమం పూజ నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘసభ్యులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# శ్రీ ఆదర్శ విద్యార్థుల ప్రతిభ




ప్రజాపక్షం/చింతకాని : తెలంగాణ సాహిత్య అకాడమీ ఖమ్మం , ట్రస్మా ఆధ్వర్యంలో నిర్వహించిన కథా కార్యశాల స్వీయ కథా రచనా పోటీల్లో నాగులవంచ శ్రీ ఆదర్శ విద్యాలయానికి చెందిన ముగ్గురు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. జిల్లా స్థాయిలో విద్యార్థుల్లో సృజనాత్మక కథారచనకు సంబంధించిన మెలకువలు నైపుణ్యాలను పెంపొందించేందుకు ఈ ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని ఖమ్మం నగరంలో శని, ఆదివారాల్లో నిర్వహించారు. ఆదర్శ విద్యాలయానికి చెందిన నున్నా రుషిత, మోదుగుల హాసిని, కణతాల సాయివర్షిణి ఈ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. వీరికి ప్రముఖ కథా రచయిత నామిని సుబ్రహ్మణ్యం నాయుడు, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు గుర్రం కాంతారావు, ఫెమా రాష్ట్ర కన్వీనర్ మువ్వా శ్రీనివాసరావు, ఐవీ రమణారావు ప్రతిభా పురస్కారం, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ బోడెపుడి కిరణ్, ప్రిన్సిపాల్ చావా అరుణ్ కుమార్ , ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

# ఆర్కా హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



ప్రజాపక్షం/చింతకాని : చింతకాని సర్పంచ్ కిలారు మనోహర్ బాబు ఆధ్వర్యంలో ఆర్కా హాస్పిటల్ ఖమ్మం వారు ఆదివారం చింతకాని గ్రామంలో చిత మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. తొలుత వైద్య సిబ్బంది గ్రామస్తులకు ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. ఉచిత వైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ మనోహర్ బాబు ప్రారంభించారు. ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ఆర్ రవికుమార్, తక్కెళ్లపల్లి దుశాకశంతరావు, కృష్ణ సాగర్‌రెడ్డి, ఉప సర్పంచ్ కోలా ఉమారాణి, వార్డు సభ్యులు పొనుగోటి బాబు, గంధసిరి లలిత, గ్రామ ప్రజలు, ఆసుపత్రి సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# తల్లంపాడులో ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ఖమ్మంరూరల్ మండలంలోని తల్లంపాడుగ్రామంలో నూతనంగా శ్రీశ్రీశ్రీ సీతాలమ్మ సమేత మడిలేశ్వర, ఈదమ్మ అమ్మవార్ల విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలుత విగ్రహాలను గ్రామంలో మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన మహా అన్నదానాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# మూడో అతిపెద్ద నేరంగా ఆడపిల్లల అక్రమ రవాణా



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద నేరంగా ఆడపిల్లల మానవ అక్రమ రవాణా ఉందని, ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ సురేష్ కుమార్ అన్నారు.ఆదివారం ఏదులాపురం మున్సిపాలిటీపరిధిలోని నాయుడుపేట కల్వరి మినిస్ట్రీస్ చర్చి నందు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... యుక్త వయసు బాలికలు ఫోన్ మోజులో పడి ప్రేమ, పెళ్లి అంటూ జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. దీనికి ప్రధాన కారణం జీవితంపై ఎలాంటి అవగాహన లేకపోవడమేనన్నారు. ఇలా వేరే ప్రాంతాలకు పారిపోవడం, చివరికి మోసపోయి వ్యభిచార గృహాలకు అమ్మబడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ తరుణంలో చివరికి ప్రాణాలు సైతం కోల్పోతున్నారని, ఆవేదన వ్యక్తం చేశారు. కాబట్టి తల్లిదండ్రులతో పాటు ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకుని, అవగాహన కల్పిస్తూ అప్రమత్తతను చాటాలని పిలుపునిచ్చారు. అలాగే అక్రమ రవాణా నిరోధక చట్టంపై వివరించారు. అనంతరం సంబంధిత కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో చర్చి ఫాస్టర్లు బి. ఎబినేజర్, కే ప్రకాష్, వివిధ ప్రాంతాల నుంచి హాజరైన భక్తులు పాల్గొన్నారు.

# డీజిల్ కొరతతో వాహనదారుల ఇబ్బందులు



**ప్రజాపక్షం/ బోనకల్ :** +జిల్లాలో డీజిల్ కొరత తీవ్రంగా పెరుగుతున్న నేపథ్యంలో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతర్జాతీయ యుద్ధ పరిస్థితుల ప్రభావంతో ఆయిల్ సరఫరా అంతరాయం కలగడంతో పలుచోట్ల పెట్రోల్ బంకుల్లో డీజిల్ పూర్తిగా కొరత ఏర్పడింది. వచ్చిన పరిమిత స్టాక్ కొద్ది గంటల్లోనే అయిపోవడంతో వాహనదారులు గంటల తరబడి క్యూలలో నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ప్రత్యేకంగా ట్రాక్టర్లు, లారీలు, ఆటోలు వంటి వాణిజ్య వాహనాలు ఎక్కువగా ప్రభావితమవుతున్నాయి. రైతులు కూడా సాగు పనుల కోసం డీజిల్ అందక ఇబ్బందులు పడుతున్నారు. కొందరు వాహనదారులు ఒక బంకు నుంచి మరొక బంకుకు తిరుగుతూ డీజిల్ కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నా ఫలితం లేకపోవడం ఆవేదన కలిగిస్తోంది. డీజిల్ అందుబాటులో లేకపోవడంతో రవాణా వ్యవస్థ కూడా దెబ్బతింటోంది. సరుకు రవాణా ఆలస్యం కావడంతో మార్కెట్ వ్యవస్థపై కూడా ప్రభావం పడుతోంది. మరోవైపు కొందరు బంకుల్లో పరిమితంగా మాత్రమే డీజిల్ ఇస్తుండటం వల్ల వినియోగదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణ చర్యలు తీసుకుని సరిపడా ఆయిల్ సరఫరా జరిగేలా చూడాలని వాహనదారులు, రైతులు కోరుతున్నారు. సమస్య మరింత తీవ్రమయ్యే ముందు పరిష్కారం చూపించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

# మే 5న జరిగే ఖమ్మం కలెక్టరేట్ ధర్నాను జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/ఎర్రుపాలెం :** కాంగ్రెస్ ప్రభుత్వం మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ మే 5న టిజి జెఎసి ఆధ్వర్యంలో చేపట్టనున్న ఖమ్మం కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయంతం చేయాలని ఆ సంఘం నాయకులు అనుమోలు కోటేశ్వరరావు, ఎస్.సంగిరెడ్డి, కంచర్ల శ్రీనివాసరావు, బొగ్గుల మదన్‌మోహన్‌ఎడ్డి, భూషన్ రాజు, నండ్రు వెంకటేశ్వరరావు, ఎం.బాబురావు పిలుపునిచ్చారు. ఆదివారం ఎర్రుపాలెంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో గత కొంతకాలంగా విడివిడిగా ఉన్న సంఘాలు తమ సమస్యల సాధన కోసం ఐక్యమై జెఎసిగా ఏర్పడ్డాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చిన విధంగా ఉపాధ్యాయ, ఉద్యోగ కార్మికుల సమస్యలను పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. సమస్యల సాధనకై ఈనెల 17న అన్ని మండల కేంద్రాల్లో కలెక్టర్ కార్యాలయం నందు నిరసన తెలిపి ప్రభుత్వానికి విన్నపాలు ఇచ్చామని, అయినా ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవటం లేదన్నారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారానికి చేపట్టనున్న కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమంలో ఆయా సంఘాల బాధ్యులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో శివపార్వతి, పుల్లమ్మ, సత్యనారాయణరెడ్డి, రాఘవరావు, అప్పిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, నాగమణి, నాగరాజు, చిన్నప్ప, వెంకటరామయ్య, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, శ్రావణి, పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా కేసిఆర్ నిలుస్తారు


**–ఊరూరా, వాడవాడలా గులాబీ జెండాలను ఎగురవేయాలి**
**–బిఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన పువ్వాడ అజయ్**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** బిఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి గ్రామంలో మున్సిపల్ వార్డు, డివిజన్లలో పార్టీ జెండాలను ఎగురవేయాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పిలుపునిచ్చారు. ఆనాడు శిథిలమైన తెలంగాణకు ఊపిరినివ్వడానికి ఎన్నో అవమానాలు, బెదిరింపులు, చీత్కారాలు, కేసులు ఎదుర్కొని నిలబడి పోరాడి తెలంగాణ రాష్ట్ర సాకారమే లక్ష్యంగా కేసిఆర్ ముందుకు సాగారన్నారు. ఈనెల 27న సోమవారం ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా జరిగే ఆవిర్భావ వేడుకల్లో పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అందరూ భాగస్వాములు కావాలని పువ్వాడ సూచించారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించి ఉద్యమ నాయకుడే ముఖ్యమంత్రిగా పదేళ్ల పాటు బిఆర్ఎస్ ప్రభుత్వంలో తెలంగాణ రాష్ట్రాన్ని దేశానికి రోల్ మోడల్ చేసిన కేసిఆర్ పేరు తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు.

# పెట్రోల్, డీజిల్ కొరతపై ఎంపి వద్దిరాజు స్పందన

**–ఆయిల్ కంపెనీ ప్రతినిధులతో టెలికాన్ఫరెన్స్**
**–సత్వరమే సమస్య పరిష్కరించాలని విజ్ఞప్తి**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తీవ్రంగా వేధిస్తున్న పెట్రోల్, డీజిల్ కొరతపై బిఆర్ఎస్ ఎంపి, పెట్రోల్, సహజ వాయువు పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర స్పందించారు. ఆయా కంపెనీల సరఫరాదారులు, ఉన్నతాధికారులతో ఆయన మాట్లాడారు. పెట్రోల్, డీజిల్ కొరతను తక్షణమే తీర్చాలని సూచించారు. ఆదివారం వరంగల్ జిల్లా పర్యటనలో ఉన్న ఎంపి వద్దిరాజు రవిచంద్రను పలువురు పెట్రోల్ బంకుల యజమానులు, అసోసియేషన్ ప్రతినిధులు కలిసి పెట్రోల్, డీజిల్ సరఫరాలో జరుగుతున్న జాప్యం, బంకుల్లో ఏర్పడుతున్న కొరత గురించి ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆయన ఆయిల్ కంపెనీల ఉన్నతాధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ధరల హెచ్చు తగ్గులను దృష్టిలో ఉంచుకుని కంపెనీలు కృత్రిమ కొరత సృష్టించే ప్రయత్నాలు మానుకోవాలని సూచించారు. ఆయిల్ కొరత ఇలాగే కొనసాగితే తెలంగాణలో సమస్యలు తీవ్రమవుతాయని ఆయన సరఫరా కంపెనీలకు వివరించారు. తక్షణమే పెట్రోల్, డీజిల్ కొరతను నివారించాలని, సరఫరాను వేగవంతం చేయాలని ఆయన కోరారు. ఇందుకు స్పందించిన ఆయిల్ కంపెనీల ఉన్నతాధికారులు సోమవారం నాటికల్లా సమస్యను అధిగమిస్తామని, ఎలాంటి ఆందోళన అవసరం లేదని ఎంపి వద్దిరాజు రవిచంద్రకు ఆయా కంపెనీల ప్రతినిధులు హామీ ఇచ్చారు.

# ఖమ్మం నగరంలో విషాదం

**–ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు మృతి**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మం నగరంలోని బుర్హాన్ పురం బొడ్రాయి సెంటర్‌లో ఓ ఇంట్లో విషాదం చోటు చేసుకుంది. ప్రాథమిక సమాచారం మేరకు నేలకొండపల్లి మండలం అనంతనగర్‌కు చెందిన కనకాల రాము జర్నలిస్టుగా పనిచేస్తూ ఈ ప్రాంతంలో అదే ఇంట్లో నివసిస్తున్నాడు. ఆయనకు భార్య రమ్యతో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఏమి జరిగిందో కానీ ఆదివారం రాము మృతదేహం ఇంట్లో కనిపించింది. రాముతో పాటు ఆయన పెద్ద కుమార్తె దివ్య (5) మరణించింది. రాము పరిస్థితిని పరిశీలించిన వారు రెండు రోజుల క్రితమే మరణించి ఉంటాడని భావిస్తున్నారు. రాము భార్య రమ్య ఆదివారం పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడడంతో విషయం వెలుగు చూసింది. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రస్తుతం రాము మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# ఘనంగా వాసవి కన్యకాపరమేశ్వరి జయంతి వేడుకలు



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** ఆర్యవైశ్యులు ఆరాధ్య కులదేవత శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి వేడుకలు ఆదివారం మండల కేంద్రం శివాలయం ప్రాంగణంలో ఘనంగా జరిగాయి. మహిళలు అమ్మవారికి పసుపు కుంకాలు పుష్పాలతో అర్చనలు ప్రార్ధనలు చేసి పసుపు కుంకాలు ప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం మహిళలు చిన్నారులు ఆటపాటలతో అలరించారు. గెలుపొందిన విజేతలకు వాసవి క్లబ్, మండల ఆర్యవైశ్య సంఘం సంయుక్తంగా విజేతలకు బహుమతులు అందచేశారు. అనంతరం 46 సంవత్సరాలు తంతితపాలా శాఖలో ఉత్తమ సర్వీస్ చేసి రిటైర్డ్ అయిన వైశ్య ప్రముఖులు కేతేపల్లి పిచ్చయ్య దంపతులకు క్లబ్ తరుపున సన్మానించి బహుమతిని అందచేశారు. రాష్ట్ర ప్రభుత్వం వాసవి జయంతి వేడుకలను అధికారికంగా ప్రకటించినందుకు కాంగ్రెస్ ప్రభుత్వానికి మండల ఆర్యవైశ్య సంఘం వారు వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య ప్రముఖులు కొప్పు పరమేశ్వరరావు, దొడ్డ అశోక్‌కుమార్, దూపకుంట్ల వెంకట అప్పారావు, కేతేపల్లి నర్సింహారావు, దొడ్డ సంధ్య, మునగలూరి మురళీ, పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ వైద్యుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలి



**ప్రజాపక్షం/ తల్లాడ :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని తెలంగాణ గ్రామీణ వైద్యుల సమానత్వ సంఘం రాష్ట్ర అధ్యక్షులుదాసి నరేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లూరి నర్సింహారావు, రాష్ట్ర అధికార ప్రతినిధి అన్నారపు నాగేశ్వరరావు కోరారు. ఆదివారం తల్లాడలో భద్రాచలం రోడ్డులో తెలంగాణ గ్రామీణ వైద్యుల సమానత్వ సంఘం తల్లాడ మండల మహాసభ జరిగింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ వైద్యులను ప్రభుత్వం గుర్తించి వారికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మర్రి నరేష్,, జిల్లా సాంస్కృతిక అధ్యక్షులు తుప్పతి శ్రీనివాసరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు టివికెచారి, జిల్లా కార్యవర్గ సభ్యులు కాకటి కరుణాకర్, జిల్లా గౌరవాధ్యక్షులు శీలం బాలకృష్ణారెడ్డి, తల్లాడమండల అధ్యక్షులు షేక్.సైదా, మండల ప్రధాన కార్యదర్శి షేక్.ఖాదర్ జాని, చిరసాని రామకృష్ణ పాల్గొన్నారు.

# పోలీసుల దాతృత్వం



**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ మండలం మల్లారం గ్రామానికి చెందిన పోలీసులు వారి దాతృత్వాన్ని చాటుకున్నారు. అదే గ్రామానికి చెదిన షేక్.యాకుబాపాషా ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి కాలు విరిగి కదల్లేని పరిస్థితిలో ఉన్నారు. దీంతో ఆకుటుంబం ఆర్థికగా ఇబ్బంది పడుతుందని గమనించిన మల్లారం పోలీసులు ఆదివారం రూ.20వేలు ఆర్థిక సహాయాన్ని ఆ కుటుంబానికి అందచేశారు. ఈ కార్యక్రమంలో మల్లారం పోలీసులు గాదె రంజిత్, కుంచం రాంప్రసాద్, దుగ్గిదేవర ముత్యాలరావు, పసుపులేటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.